16 నుంచి ఉచిత టైలరింగ్ శిక్షణ

అబిడ్స్, జనవరి 13: శ్రీ సత్య సాయి సేవా సంస్థలు, కోటి సమితి ఆధ్వర్యంలో ఉస్మాన్‌గంజ్ తోప్‌ఖానాలోని శ్రీ సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ 20వ బ్యాచ్‌ను ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు కోటి సమితి కన్వీనర్ పి. విశ్వేశ్వర శాస్త్రి శనివారం తెలిపారు. గోషామహల్ నియోజకవర్గంలో నివసించే ఆసక్తి గల పేద మహిళలు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8886509410, 9440409410 నంబర్‌ల్లో సంప్రదించాలని కోరారు.

న్యూ ఉస్మాన్‌గంజ్ హమాలీ సంఘం నూతన కార్యవర్గం

న్యూ ఉస్మాన్‌గంజ్ హమాలీ సంఘం నూతన కార్యవర్గం అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ సంతోశ్ ను పోలీస్ స్టేషన్‌లో కలిసి సత్కరించారు. సంఘం అధ్యక్షుడు ఎస్. ధన్‌రాజ్, కమిటీ సభ్యులు జె రామకృష్ణ, నసీర్, అంజయ్య, హబీబ్, కర్ణ, ఆకాశ్, మహేశ్‌లు ఇన్‌స్పెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. – అబిడ్స్, జనవరి 13

పథకాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి రాజ్‌కుమార్ సింగ్

వికసిత్ సంకల్ప యాత్రలో స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

ఆర్థికాభివృద్ధిలో భారత్ ఐదవ స్థానం

● వికసిత్ సంకల్ప యాత్ర సందర్భంగా కేంద్రమంత్రి రాజ్‌కుమార్‌సింగ్

చిక్కడపల్లి, జనవరి13 : ప్రపంచంలోనే భారతదేశం ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాల సరసన 5వ స్థానంలో నిలిచిందని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు సమీపంలో వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్‌కుమార్‌సింగ్ స్టేట్ బ్యాంక్ ఇండియా ద్వారా మంజూరైన పథకాలకు సంబంధించిన మంజూరు పత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పథకాల ఫలాలు ప్రజలకు చేరవచేసేందుకు, ప్రజల్లో చైతన్యం తీసుకురావాడానికి వికసిత్ సంకల్ప యాత్రను చేపట్టడం జరిగింద అన్నారు. ఈ యాత్ర 26 తేదీ వరకు కొనసాగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ దేశిష్‌మిత్ర, డీజీఎం మోహన్ దాస్, చీఫ్ మేనేజర్ వీవీఆర్ రఘురాం, తెలంగాణ స్టేట్ లెవెల్ బ్యాంకర్ కమిటీ ఏజీఎం హరి, జి.లింగస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ రవిచారి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ రేడియంట్ స్కూల్‌లో శనివారం జరిగిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్. చిత్రంలో నాయకులు జయసింహ, పాఠశాల యాజమాని హమ్మదుల్లా భక్తియారి – ముషీరాబాద్, జనవరి 13

గోదాదేవి తిరుప్పావై సీడీ ఆవిష్కరణ

కలహంపి ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో సినీ కవి డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ రచించిన 'గోదాదేవి తిరుప్పావై' తెలుగు గీతాల సీడీని బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దూరదర్శన్ కేంద్రం డైరెక్టర్ కె.కామేశ్వరి, ఆచార్య టీ గౌరీశంకర్, గాయని వీకే దుర్గ, డాక్టర్ శ్రీభాష్యం యదుమోహన్ పాల్గొన్నారు. – ముషీరాబాద్, జనవరి 13

ఫీర్ పాషా దర్గాలో ఉర్సులో ఎమ్మెల్యే మాజీద్

ఆసిఫ్‌నగర్ మురాద్‌నగర్ సయ్యద్ అలీగూడలో ఉన్న హజరత్ సయ్యద్ ఫీర్ పాషా దర్గాలో జరుగుతున్న ఉర్సు ఉత్సవాలలో నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ పాల్గొని చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేసేలా దేవుడిని వేడుకున్నట్లు తెలిపారు. – మెహిదీపట్నం జనవరి 13

జోరుగా పతంగుల విక్రయాలు

చార్మినార్, జనవరి 13: పతంగుల పండగ వచ్చిందంటే చాలు చిన్నా పెద్ద తేడాల్లేకుండా గంతులేస్తూ గాల్లో పతంగులను ఎగురవేస్తూ పోటీపడుతుంటారు. గాలిపటాల విక్రయాలు వివిధ ప్రాంతాల్లో జోరుగా సాగుతున్నాయి. చార్మినార్, గుల్జర్‌హౌస్, హుస్సేనిఅలం, పురాణపూల్, లాల్‌దర్వాజా తదితర ప్రాంతాల్లో వివిధ రకాలైన గాలిపటాల అమ్మకాలతో వ్యాపారులు, ఇటు యువత ఉత్సహాన్ని ప్రదర్శిస్తూ కొనుగోళ్లు చేస్తున్నారు. మరోవైపు చైనా మాంజాల నిషేదంతో నగర మార్కెట్లోకి తిరిగి సాధరణమాంజాల తయారీ జోరందుకుంది. పురాణాపూల్‌తోపాటు పాతనగరంలో వివిధ ప్రాంతాల్లో మాంజా తయారీ వారం రోజులుగా పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారు.ఎత్తైన భవనాలపై గాలిపటాలను ఎగరవేసే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రమాదాల నివారణ కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. ప్రమాదాలు జరుగకుండా స్వీయ నియంత్రణలు పాటించాలని పోలీసులు తెలిపారు.

అంబర్‌పేట్ జైస్వాల్ గార్డెన్‌లోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ 28వ వార్షికోత్సవం శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఉపేందర్, కృష్ణవేణి పాల్గొన్నారు. – చిక్కడపల్లి, జనవరి 13

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

కల్లుగీత వృత్తి రక్షణకు చర్యలు

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

చిక్కడపల్లి, జనవరి 13 : కల్లుగీత వృత్తి రక్షణకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. కల్లుగీత వృత్తి దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను శనివారం మంత్రి ప్రభాకర్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, వర్కింగ్ చైర్మన్ యెలికట్టే విజయ్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్ కుమార్‌గౌడ్, అంబాల నారాయణ గౌడ్, ప్రేమ్‌దాస్ గౌడ్, దుర్గయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అహ్మద్‌నగర్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటన

అహ్మద్‌నగర్ డివిజన్‌లో శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. బస్తీల్లోని సమస్యలపై స్థానికులు కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని కేంద్ర మంత్రి ఆదేశించారు. – మెహిదీపట్నం జనవరి 13

విద్యారంగంపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

అంబర్‌పేట, జనవరి 13 : కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ కేంద్రీకరించి విద్యా రంగం బలపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పరశురామ్ డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన పరశురామ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ విద్యారంగానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి వాటి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రియాజ్, నాగరాజు, సతీశ్, రమేశ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచపదుల మణిహారం పుస్తకావిష్కరణ

కాలేజ్ ఆఫ్ కేపీ అస్ట్రాలజీ ఆధ్యాత్మిక విభాగం ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి త్యాగగానసభలో డాక్టర్ జి. భవానీకృష్ణమూర్తి రచించిన 'భవానీ పంచపదుల మణిహారం' పుస్తకాన్ని అధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ అనంతలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కిరణ్మయి, విఠల్, స్వామి, బాలసుబ్రహ్మణ్య శర్మ, డాక్టర్ జివి కృష్ణమూర్తి, రాధా కుసుమ తదితరులు పాల్గొన్నారు. – ముషీరాబాద్, జనవరి 13

అయోధ్య ఆహ్వాన పత్రికలకు పూజలు

ఈ నెల 22న అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం జరగనున్న సందర్భంగా గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్ శ్రీమైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. శనివారం ఆలయ పూజారులు సత్యం, గోపీ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముల అంక్షింతలు, రామ మందిర ఆహ్వాన పత్రికలకు పూజలు నిర్వహించి ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జైస్వాల్ గార్డెన్ అధ్యక్షుడు, కరసేవకుడు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్, ప్రతినిధులు ఎన్ రమేశ్‌గౌడ్, ప్రసన్నాంజనేయులు, రామాగౌడ్, మధుసూదనాచారి, వినోద్‌కుమార్, అనిల్‌చారి తదితరులు పాల్గొన్నారు. – గోల్నాక, జనవరి13

బీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ) అనుబంధ జీ4 ఎంప్లాయిస్ యూనియన్ క్యాలెండర్‌ను శనివారం బాగ్‌లింగంపల్లి బీఆర్‌టీయూ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి మాజీ చైర్మన్ వి.నారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.మారయ్య, జీ4ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. – చిక్కడపల్లి, జనవరి 13

పతేదర్వాజాలోని శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం వైభోవోపేతంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కొనసాగిన కల్యాణోత్సవంలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పల్లకి సేవల్లో చార్మినార్ ఏసీపీ రుద్రభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. – చార్మినార్, జనవరి 13

దుకాణదారులను వేధిస్తే సహించేది లేదు

అబిడ్స్, డిసెంబర్ 13: ధూల్‌పేటలో గాలిపటాలు, మాంజా విక్రయించే చిన్న వ్యాపారులపై పోలీసులు వేధింపులకు పాల్పడితే సహించేది లేదని గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ పేర్కొన్నారు. ధూల్‌పేటలోని దుఖానాలను సందర్శించారు. మంగళ్‌హాట్ ఠాణా నుంచి ధూల్‌పేట, జాలి హనుమాన్ మీదుగా పురానాపూల్ గాంధీ విగ్రహం వరకు ఏర్పాటు చేసిన దుకాణదారులను పోలీసులు వేధిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.

హైకోర్టులో ఖాళీలను భర్తీ చేయాలి

కవాడిగూడ, జనవరి 13: హైకోర్టులో అడ్వకేట్‌లకు సంబంధించిన ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామిని కలిసి వినతిపత్రాన్ని అందజేసినట్లు మాదిగ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌రాజు తెలిపారు. అసిస్టెంట్ ప్లీడర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, స్టాండింగ్ కౌన్సిల్ అడిషనల్, అడ్వకేట్ జనరల్ పోస్టుల్లో దళితులకు సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

పద్మశాలి మేళా కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్

చిక్కడపల్లి, జనవరి 13: తెలంగాణ పద్మశాలి మేళా కమిటీ 2024 నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా భీమనాతిని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడి చిప్ప అనంతరాములు, ప్రధాన కార్యదర్శి పాచికంటి నాగమూర్తి, సంయుక్త కార్యదరిశగా సుదర్శన్, కోశాధికారిగా జానయ్య, చీఫ్ అడ్వైజర్‌గా జయరాజు ఎన్నికయ్యారు. ఈ నెల 26న ఇందిరాపార్క్‌లో పద్మశాలి–2024 కార్యక్రమానికి పద్మశాలి కుల బాంధవులు అందరూ విచ్చేసి జయప్రదం చేయాలని శ్రీనివాస్ కోరారు.

దారుస్సలాంలో నిలిచి పోయిన ట్రాఫిక్

భారీగా స్థంభించిన ట్రాఫిక్

అబిడ్స్, జనవరి 13: అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు భారీగా సందర్శకులు తరలి రావడంతో నాంపల్లి పరిసర ప్రాంతాలతో పాటు అంతర్గత రహదారులలో కూడా ట్రాఫిక్ పెద్ద ఎత్తున స్థంభించి పోయింది. సంక్రాంతి పండుగ సెలవులు రావడం, వీకెండ్ కావడంతో నుమాయిష్‌కు సందర్శకులు పోటెత్తారు. దీంతో నాంపల్లి మీదుగా వాహనాల రాక పోకలు స్థంభించి పోయాయి. పరిసర ప్రాంతాలైన ఏక్‌మినార్ మసీదు, దారుస్సలాం, గోషామహల్, ఆగాపురా తదితర ప్రాంతాలలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్థంభించి పోయింది. వాహనదారులు గంటల తరబడి రహదారులపై నిలిచి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధాన రహదారులలో ట్రాఫిక్ నిలిచి పోవడంతో వాహనదారులు అంతర్గత రహదారుల మీదుగా తమ గమ్య స్థానాలకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఆ రహదారులలో కూడా ట్రాఫిక్ నిలిచి పోయింది.

అనాథ పిల్లలకు పతంగుల పంపిణీ

అంబర్‌పేట, జనవరి 13: నల్లకుంట డివిజన్ టీఆర్టీ కాలనీలో గల స్ఫూర్తి అనాథ పిల్లలకు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శివసేన ఆధ్వర్యంలో శనివారం పతంగులను పంపిణీ చేశారు. శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సుదర్శన్, అధికార ప్రతినిధి గౌట్ గణేశ్, హైకోర్టు అడ్వకేట్ పెంటం రాజేశ్ తదితరులు అనాథ ఆశ్రమానికి వెళ్లి అక్కడి పిల్లలకు పతంగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం ఇన్‌చార్జి దిలీప్ కుమార్, వార్డెన్ సుమబాల పాల్గొన్నారు.

సరస్వతి శిశు మందిర్ పాఠశాల వార్షికోత్సవం

కార్వాన్, జనవరి13: కార్వాన్‌లోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల 43వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్ర మం లో రాష్ట్ర వ్యవస్థాపక కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్‌రావుతో పాటు ఇతర వక్తలు పాల్గొన్నారు.

రంగనాయక స్వామి ఉత్సవాలు నేటి నుంచే

మెహిదీపట్నం జనవరి 13 : కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్ డివిజన్ ఫ్లోర్‌మిల్ ఇందిరానగర్ తిరుపల్లి గడ్డ వద్ద ఉన్న కోవెల రంగనాయక స్వామి సంక్రాంతి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మంగళవారం వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు ఉంటాయని ఆలయ ఈవో శ్రీనివాస రాజు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

22న రామమందిర ప్రారంభోత్సవం

రవీంద్రభాతి, జనవరి 13 : 22న అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా సీతారాంబాగ్ ఆలయంలో శ్రీసీతారాం మహారాజ్ సంస్థాన్, దేవాలయ రక్షణ సమితి ఆధ్వర్యంలో శ్రీరామాలయ ప్రారంభోత్సవాలను నిర్వహిస్తున్నట్లు దేవాలయ రక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సందీప్ కుమార్ వెల్లడించారు.

గృహిణి అదృశ్యం

సుల్తాన్‌బజార్, జనవరి 13: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిన గృహిణి అదృశ్యమైన ఘటన బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి గాంధీభవన్ పటేల్‌నగర్‌లో నివసించే సయ్యద్ ఉస్మాన్ భార్య ఆసియా బేగం(34)తో 12 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పదేళ్ల కుమారుడు ఉన్నాడు. కాగా ఉస్మాన్‌కు వరుసకు సోదరుడైన మహ్మద్ రషీద్ (40)తో తన భార్య ఆసియా బేగంకు వివహేతర సంబంధం నేపథ్యంలో గతంలో పెద్దల సమక్షంలో చర్చించి ఒప్పందం చేశారు. కాగా ఈ నెల 9వ తేదీన సాయంత్రం 4:30 గంటల ప్రాంతంలో తన భార్య ఆసియా బేగం తనతో ఫోన్‌లో మాట్లాడిందని ఉస్మాన్ తెలిపాడు. కాగా వ్యాపారం ముగించుకొని రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చిన ఉస్మాన్‌కి తన భార్య కనిపించక పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుకి దర్యాప్తు చేస్తున్నారు.

'చలో ఢిల్లీ' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

కేంద్రంపై బీసీల తిరుగుబాటు తప్పదు

● రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ, జనవరి 13: దేశంలో జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేన్లు కల్పించేందుకు పార్లమెంట్‌లో రాజ్యంగ సవరణ చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో శనివారం కాచిగూడలో వివిధ రాష్ట్రాల బీసీ సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 5,6 తేదీల్లో 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని చేపట్టి పార్లమెంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. బీసీలకు మోదీ ప్రభుత్వం అణిచివేస్తుందని, కేంద్రం తీరు మార్చుకోకపోతే తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేశ్, సుధాకర్, నందగోపాల్, కోట్ల శ్రీనివాస్, రామకృష్ణ, రాజేందర్, రాజేందర్, ఉదయ్, లింగయ్యయాదవ్, రాందేవ్, మల్లేశ్, కృష్ణయాదవ్, రాజేశ్ పాల్గొన్నారు.

ఉచితంగా మూలగౌరి నోము పూజా సామగ్రి

ముషీరాబాద్, జనవరి 13: సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం శ్రీవాసవి స్వర్ణనిధి రాంనగర్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా మూలగౌరి నోము పూజా సామగ్రి, కానుకలను శనివారం ఆ సంస్థ ప్రతినిధులు వి.అరుణకుమారి, అపర్ణ, మమత, స్వర్ణరాణి, దుర్గ పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ చందా ప్రకాశ్ గుప్తా, ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి మల్లికార్జున్, రాంనగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వి.సుధాకర్‌గుప్తా పాల్గొన్నారు.

రైలు ఢీకొని కూలీ మృతి

కాచిగూడ, జనవరి 13: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని కూలీ మృతిచెందిన ఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య కథనం ప్రకారం.. కూలీ చేసుకుంటూ జీవనం సాగించే అలంపూర్ ప్రాంతానికి చెందిన లక్ష్మయ్య కుమారుడు బుచ్చయ్య శుక్రవారం అర్ధరాత్రి తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా అదే సమయంలో వచ్చిన 09519 రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు వెల్లడించారు.

పతంగుల పంపిణీ

సంక్రాతి పండుగను పురస్కరించుకొని మాలకుంట గుడిసెలలో నివసించే నిరుపేద విద్యార్థులకు జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ పతంగులను పంపిణీ చేశారు. – అబిడ్స్, జనవరి 13

గోల్కొండ మోహల్లాగంజ్‌లో శనివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గోల్కొండ బోనాల కులవృత్తుల సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి పతంగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌చారి పాల్గొన్నారు. – మెహిదీపట్నం, జనవరి13